ఎప్పటి చెత్త అప్పుడే తరలింపు!



నమ్మివానిపేట డంపింగ్‌యార్డు నుంచి లారీతో తరలిస్తున్న చెత్త



డంపింగ్‌యార్డులో సిబ్బందికి సూచనలు చేస్తున్న భీమిలి జెడ్సీ రాము

- నమ్మివానిపేటలో గార్బేజ్ ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం
- ప్రశాంతంగా ఊపిరి పీల్చుకోనున్న డంపింగ్‌యార్డు పరిసర ప్రాంతీయులు

తగరపువలస: జీవీఎంసీ భీమిలి జోన్ పరిధిలోని నమ్మివానిపేట డంపింగ్ యార్డు చుట్టుపక్కల గ్రామాల ప్రజలు ఇకపై ప్రశాంతంగా ఊపిరి పీల్చుకోనున్నారు. ఇక్కడ పేరుకుపోయిన చెత్త నిల్వల నుంచి ఏటా మంటలు చెలరేగి చుట్టూ 5 నుంచి 10 కిలోమీటర్ల పరిధిలో పొగ కమ్ముకుని అక్కడి ప్రజలు ఉక్కిరిబిక్కిరి అయ్యేవారు. డంపింగ్ యార్డును ఆనుకుని రహదారులు రోజుల తరబడి పొగతో మూసుకుపోయేవి. ఈ పొగ కారణంగా నమ్మివానిపేట, వలందపేట, బ్యాంకు కాలనీ, సంగివలస, ఆదర్శనగర్, ఊళ్లపేట, ఇడదాసరిపేట, తాళ్లవలస, మామిడిపాలెం తదితర గ్రామాల ప్రజలు దగ్గు, శ్వాసకోశ సంబంధమైన వ్యాధులతో బాధపడేవారు. ఈ సమస్య నుంచి గట్టెక్కించడానికి ఎప్పుడు వచ్చిన చెత్తను అప్పుడే కాపులుప్పాడ డంపింగ్‌యార్డులోని జిందాల్ పవర్ ప్లాంట్‌కు తరలించేందుకు నమ్మివానిపేటలో గార్బేజ్ ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్ నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. ఇప్పటికే భూమిపూజ జరిగి పిల్లర్లు వేస్తున్నారు.

రోజూ 66 టన్నుల చెత్త సేకరణ..

భీమిలి జోన్‌లో 21 క్లాప్ వాహనాల్లో 16 వాహనాలు జీవీఎంసీ 1, 2, 3 వార్డుల నుంచి సగటున 35 ట్రిప్పులకు 26 టన్నుల చెత్త సేకరిస్తున్నాయి. అలాగే రోడ్ల పక్కన డంపర్ బిన్ల నుంచి మూడు కాంపాక్ట్ వాహనాల ద్వారా మూడు ట్రిప్పులకు 25 టన్నుల చెత్త, శివారు గ్రామాల నుంచి రెండు ట్రాక్టర్లు, ఇతర వాహనాల ద్వారా 5 టన్నుల చెత్త నమ్మివానిపేట డంపింగ్ యార్డుకు తరలిస్తుంటారు. 4వ వార్డులో ట్రాక్టర్, టాటా ఏస్, అయిదు క్లాప్ వాహనాల నుంచి 10 టన్నుల చెత్తను ఉప్పాడ పరిసరాల్లోని ఖాళీ స్థలానికి తరలిస్తున్నారు. ప్రస్తుతం డంపింగ్ యార్డు నుంచి జీవీఎంసీ భారీ వాహనం ద్వారా రోజూ 5 ట్రిప్పులలో 55 టన్నుల చెత్త కాపులుప్పాడ జిందాల్ ప్లాంట్‌కు తరలుతుంది. దిబ్బలుగా పేరుకుపోయిన చెత్త నిల్వలను కాపులుప్పాడ తరలించేందుకు గత మార్చి నెలలో ఆరు ప్రైవేట్ వాహనాల ద్వారా సుమారు 400 ట్రిప్పుల్లో 5 వేల టన్నుల చెత్త తరలించారు. ఇంకా యార్డులో 25 వేల టన్నుల చెత్త ఉన్నట్టు అంచనా.



గార్బేజ్ ట్రాన్స్‌పోర్ట్ స్టేషన్ నిర్మాణానికి కేటాయించిన స్థలం

గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్ నిర్మాణ పనులు..

నమ్మివానిపేట డంపింగ్ యార్డులో చెత్త నిల్వలు పేరుకుపోకుండా ఏ రోజు వచ్చిన చెత్తను ఆ రోజే తరలించడానికి గార్బేజ్ ట్రాన్స్‌ఫర్ స్టేషన్‌ను నిర్మించతలపెట్టారు. ఇటీవల భూమి పూజ జరిపి భూమి ఉపరితలం వరకు పిల్లర్లు వేశారు. సుమారు 9 ఎకరాల విస్తీర్ణంలో ఉన్న ఈ డంపింగ్ యార్డులో కూరగాయల వ్యర్థాలతో సేంద్రీయ ఎరువులు, వర్మీ కంపోస్ట్ తయారు చేస్తున్నారు. అంతేకాకుండా పండ్లు, పూలమొక్కలు, ఆకుకూరలు, కూరగాయల సాగుకు స్థలాన్ని కేటాయించి చెత్త కుప్పలతో నిలయమైన యార్డును నందనవనంగా తీర్చిదిద్దుతున్నారు. దీని కోసం శిథిలమైన చోట ప్రహరీ, లైట్లు, గేట్లు పునరుద్ధరించనున్నారు. ఈ మేరకు భీమిలి జెడ్సీ రాము ఇటీవల యార్డులో పర్యటించి సిబ్బందికి పలు సూచనలు చేశారు.



యార్డులో వర్మీ కంపోస్ట్ బెడ్లు

రైతు సంక్షేమమే ప్రభుత్వ ధ్యేయం



మద్ది ఆర్బీకేలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని ప్రారంభిస్తున్న ఎమ్మెల్యే శ్రీనివాసరావు

ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

పద్మనాభం: రైతు సంక్షేమమే ధ్యేయంగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్ రెడ్డి పాలన సాగిస్తున్నారని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని మద్ది గ్రామంలో గల రైతు భరోసా కేంద్రంలో మొక్కజొన్న కొనుగోలు కేంద్రాన్ని శుక్రవారం ఆయన ప్రారంభించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ రైతులు పండించిన పంటకు గిట్టుబాటు ధర కల్పించేందుకే తమ ప్రభుత్వం కొనుగోలు కేంద్రాలను ఏర్పాటు చేస్తుందన్నారు. గతంలో చంద్రబాబునాయుడు వ్యవసాయం దండగ అన్నారని గుర్తు చేశారు. ప్రస్తుతం సీఎం వైఎస్ జగన్ మోహన్ రెడ్డి రైతు భరోసా వంటి పథకాలు ప్రవేశపెట్టి వ్యవసాయాన్ని పండగ చేసి చూపించారన్నారు. భీమునిపట్నం సబ్ డివిజన్‌లోని మూడు మండలాల్లో 20 వేల క్వింటాళ్ల మొక్కజొన్న పంట కొనుగోలు చేసేందుకు రైతుల వద్ద ఉందన్నారు. క్వింటాకు మద్దతు ధర రూ.1962 ఇస్తున్నట్టు తెలిపారు. ఏపీ మార్క్‌ఫెడ్ ద్వారా పద్మనాభం మండలంలోని పొట్నూరు, కృష్ణాపురం, పాండ్రంగి, బాందేవుపురం, భీమునిపట్నం మండలం దాకమర్రి ఆర్బీకేల్లో మొక్కజొన్న పంట కొనుగులు చేస్తామన్నారు. ఏ ఒక్క రైతూ దళారీలకు అమ్మకుండా ప్రభుత్వం ఏర్పాటు చేసిన కొనుగోలు కేంద్రాల్లోనే మొక్కజొన్న విక్రయించాలన్నారు. అనంతరం వైఎస్సార్ బీమా కింద మృతురాలు పేకేటి ఎర్రమ్మ కుటుంబ సభ్యులకు రూ.1 లక్ష మంజూరుకాగా తక్షణ సాయంగా రూ.10 వేలు అందజేశారు. అనంతరం మద్ది గ్రామంలోని కల్యాణ మండపం వద్ద వాటర్ ట్యాంక్‌ను ఎమ్మెల్యే శ్రీనివాసరావు ప్రారంభించారు. ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, జిల్లా వ్యవసాయ శాఖ అధికారి అప్పలస్వామి, మార్క్‌ఫెడ్ మేనేజర్ రమేష్, వైఎస్సార్ సీపీ మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు, సర్పంచ్ బుగత సన్యాసమ్మ, ఎంపీడీవో ఎం.విజయ్‌కుమార్, తహసీల్దార్ టి.శ్రీవల్లీ, బాందేవుపురం కో – ఆపరేటివ్ సొసైటీ అధ్యక్షుడు బుగత శ్రీనివాసరావు, వైఎస్సార్ సీపీ నాయకులు బుగత సత్యనారాయణ, ఈర్ల ఈశ్వరరావు, బోని సన్యాసినాయుడు, రామసింగు ముత్యాలనాయుడు, సీర సూరప్పడు పాల్గొన్నారు.

క్లుప్తంగా

గ్రంథాలయంలో పుస్తకాల ప్రదర్శన

తగరపువలస: ఆనందపురం శాఖా గ్రంథాలయంలో వేసవి విజ్ఞాన శిబిరంలో భాగంగా నూతనంగా సరఫరా చేసిన పుస్తకాలను శుక్రవారం ప్రదర్శించారు. గ్రంథాలయ అధికారి బీవీఎస్ అప్పారావు ఆధ్వర్యంలో విద్యార్థులు, సచివాలయ సిబ్బంది, భీమిలి ఏఎంసీ మాజీ డైరెక్టర్ కొట్యాడ రెడ్డిబాబు తదితరులు సందర్శించారు. బాల సాహిత్యం, జనరల్ నాలెడ్జ్, నీతి, భాషలకు సంబంధించిన పుస్తకాలు ఉన్నాయని, వాటిని సద్వినియోగం చేసుకోవాలని రెడ్డిబాబు కోరారు. ఈ సందర్భంగా బహుమతులు అందించారు. మ్యాజిక్ బస్ స్వచ్ఛంద సంస్థ ప్రతినిధులు కె.రమణమ్మ, టి.ఆదిలక్ష్మి విద్యార్థులను ఆటలు ఆడించి ఆరోగ్య సూత్రాలు వివరించారు.

వైభవంగా స్నపన తిరుమంజనం



పూజలు నిర్వహిస్తున్న అర్చకులు

కొమ్మాది: రుషికొండలోని శ్రీమహాలక్ష్మి గోదాదేవి సహిత శ్రీవేంకటేశ్వరస్వామి ఆలయంలో శుక్రవారం శ్రీవారి శ్రవణ నక్షత్రం సందర్భంగా స్నపన తిరుమంజనం వైభవంగా నిర్వహించారు. ముందుగా శ్రీదేవి భూదేవి సహిత శ్రీవారి ఉత్సవమూర్తులను మంగళవాయిద్యాల నడుమ ఆలయ ప్రాంగణంలో ప్రతిష్ఠించారు. టీటీడీ అర్చకుల ఆధ్వర్యంలో పూజలు, అభిషేకాలు చేశారు.

శారదాంబకు ప్రత్యేక పూజలు

పీఎం పాలెం : శ్రావణ సప్తమి సందర్భంగా శ్రీ శృంగేరీ మఠంలో కొలువుతీరిన శారదాంబ అమ్మవారికి శుక్రవారం ప్రత్యేక పూజలు, అర్చనలు చేశారు. అర్చకులు ప్రత్యేక పువ్వులతో అమ్మవారిని అలంకరించారు. అధిక సంఖ్యలో భక్తులు దర్శించుకున్నారు.

తాటాకు ఇల్లు దగ్ధం



బాధితులను పరామర్శిస్తున్న స్థానికులు

తగరపువలస: భీమిలి మండలం తాటితూరు కళ్లాల్లో శుక్రవారం షార్ట్ సర్క్యూట్ కారణంగా శిరుగుడి సంతోషి అనే మహిళ తాటాకు ఇల్లు కాలిపోయింది. ఈ ప్రమాదంలో బాధితురాలి ఇంట్లో వస్తువులు, గృహోపకరణాలు కాలిపోయాయి. చిట్టివలస అగ్నిమాపక సిబ్బంది మంటలు అదుపు చేశారు. ప్రమాదంలో రూ.60వేల నష్టం జరిగి ఉంటుందని అగ్నిమాపక శాఖాధికారి జి.శ్రీనివాసరాజు తెలిపారు. వైఎస్సార్‌సీపీ నాయకుడు శిరుగుడి ఈశ్వరరావు తదితరులు బాధితులను పరామర్శించారు.

లలితా పీఠంలో చండీ హోమం



హోమం నిర్వహిస్తున్న వేద పండితులు

సీతంపేట: లలితా నగర్‌లోని లలితా పీఠంలో వైశాఖ మాసం బహుళ అష్టమి సందర్భంగా శనివారం ఉదయం చండీ హోమం నిర్వహించారు. పండితుల వేదమంత్రాల మధ్య శాస్త్రోక్తంగా జరిపించారు. గణపతి పూజ, కలశ శుద్ధి, అగ్ని ప్రతిష్ఠాపన, గోపూజ, పరివార పూజ, సుహాసిని పూజ, దంపత పూజ, చండీ సప్తశతి చివరగా పూర్ణాహుతి చేశారు. లోక కల్యాణం, విశేష కార్యసిద్ధి కోసం జగన్మాతను ఆరాధించడంలో భాగంగా చండీ హోమం నిర్వహించినట్టు లలితా పీఠం మేనేజర్ మన్నవ కృష్ణసేన్ తెలిపారు. హోమం వల్ల ఆరోగ్యం, విజయం సిద్ధిస్తాయన్నారు. సాయంత్రం కాళీ కాలభైరవ హోమం నిర్వహించారు. భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

అండర్ పాత్‌వే పనులకు భూమిపూజ



వెల్లంకిలో అండర్ పాత్‌వే పనులకు భూమి పూజ చేస్తున్న వైఎస్సార్‌సీపీ నాయకులు

తగరపువలస: ఆనందపురం మండలం జాతీయ రహదారి నుంచి వెల్లంకి గ్రామంలోకి వెళ్లేందుకు వీలుగా రూ.10 లక్షల మండల పరిషత్ నిధులతో చేపట్టనున్న అండర్ పాత్‌వే పనులకు శుక్రవారం భూమి పూజ చేశారు. కార్యక్రమంలో ఎంపీపీ మజ్జి శారద ప్రియాంక, జెడ్పీటీసీ సభ్యుడు కోరాడ వెంకటరావు పాల్గొని మాట్లాడారు. అవసరమైతే అదనంగా మండల పరిషత్ నిధులు తీసుకొస్తామన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ మండల వర్కింగ్ ప్రెసిడెంట్ మజ్జి వెంకటరావు, భీమిలి ఏఎంసీ చైర్మన్ ఎలమంచిలి సూర్యనారాయణ, సర్పంచ్ ఉప్పాడ లక్ష్మణరావు, బీసీ కార్పొరేషన్ డైరెక్టర్ కె.చంద్రమౌళి, నాయకులు పిన్నింటి వెంకటరమణ, పడాల రాము, తోణంగి అప్పారావు, బొట్ట రామకృష్ణ, కాకర వెంకటరమణ, పడాల అప్పలనాయుడు, కంచరాపు శ్రీనివాసరావు, స్థానిక పెద్దలు దామోదరరావు, కుర్రాయి సూరిబాబు, గోలి రాంబాబు, భావన రమణ, గోలి సతీష్ తదితరులు పాల్గొన్నారు.

విజ్ఞాన్ విహార్ విద్యార్థుల సత్తా

తగరపువలస: ఈ ఏడాది మార్చిలో నిర్వహించిన సీబీఎస్ఈ పదో తరగతి పరీక్షల్లో ఆనందపురం మండలం గుడిలోవ విజ్ఞాన్ విహార్ విద్యార్థులు సత్తా చాటారు. 93 మంది పరీక్షలకు హాజరుకాగా నూరు శాతం ఉత్తీర్ణత సాధించారు. వీరిలో పి.సౌమ్యహర్షిత 500 మార్కులకు 465 సాధించి ప్రథమ స్థానంలో నిలిచింది. కె.శాండిల్య శృతి 462, ఎం.మధుశ్రీకర్ 460 మార్కులతో రెండు, మూడో స్థానాల్లో నిలిచారు. ఈ సందర్భంగా విద్యార్థులను యాజమాన్యం, ప్రిన్సిపాల్, సిబ్బంది అభినందించారు.

నైపుణ్యాలతో మంచి అవకాశాలు

కొమ్మాది: వృత్తిలో నైపుణ్యాలు కలిగి ఉంటేనే మంచి ఉద్యోగ అవకాశాలు వస్తాయని గీతం స్కూల్ ఆఫ్ బిజినెస్ అనలటిక్స్ అండ్ ఫిన్‌టెక్ విభాగ అధిపతి డాక్టర్ డి.విజయగీత అన్నారు. శుక్రవారం గీతం డీమ్డ్ విశ్వవిద్యాలయం స్కూల్ ఆఫ్ బిజినెస్ ఆధ్వర్యంలో నిర్వహించిన ఫ్యాకల్టీ డెవలప్‌మెంట్ ప్రోగ్రాంలో పాల్గొని మాట్లాడారు. వాణిజ్య విద్యకు గుర్తింపు ఉండడం వల్ల దీన్ని బోధించే అధ్యాపకులకు ప్రత్యేక అవగాహన కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామని తెలిపారు. బెంగళూరుకు చెందిన డేటా సెంటర్ ల్యాబ్ నిపుణులు ప్రొఫెసర్ దినేష్‌కుమార్, ఆంధ్ర, తెలంగాణ, కర్ణాటక రాష్ట్రాల అధ్యాపకులు పాల్గొన్నారు.

నైటింగేల్ సేవలు ఎనలేనివి

కొమ్మాది: నర్సింగ్ వృత్తిలో ఎంతో ప్రేమ, అభిమానాలతో ఫ్లోరెన్స్ నైటింగేల్ ఉత్తమ సేవలు అందించారని గీతం నర్సింగ్ కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ లక్ష్మమ్మ అన్నారు. శుక్రవారం ఫ్లోరెన్స్ నైటింగేల్ జయంతి సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో మాట్లాడారు. ముందుగా ఆవరణలో ఉన్న ఆమె విగ్రహానికి పూలమాలవేసి నివాళులర్పించారు. నిరంతరం సేవే పరమావధిగా నైటింగేల్ ఎనలేని సేవలు అందించారని కొనియాడారు. గీతం ఆస్పత్రిలో నర్సింగ్ వృత్తిలో ఉన్నవారు ఆమెను ఆదర్శంగా తీసుకుని సేవలు అందివ్వాలని కోరారు. నర్సింగ్ కళాశాల విద్యార్థులు, సిబ్బంది పాల్గొన్నారు.

హనుమాన్ జయంతి ఉత్సవాలకు ఏర్పాట్లు

పీఎం పాలెం : స్థానిక బక్కన్నపాలెం రోడ్డులో గల శ్రీ శృంగేరీ శంకర మఠంలో ఈ నెల 14న హనుమాన్ జయంతి పర్వదినాన్ని పురస్కరించుకుని మఠంలోని ప్రసన్న ఆంజనేయ స్వామికి ప్రత్యేక అర్చన, అభిషేకాలు జరుపుతామని మఠం గౌరవ ధర్మాధికారి జగర్లపూడి వెంకటేశ్వర్లు తెలిపారు. ఆ రోజు ఉదయం 5 గంటలకు ప్రాతఃకాల అర్చనతో ఉత్సవాలు ప్రారంభమవుతాయని, 6 గంటలకు పంచామృత అభిషేకం, విశేష అలంకరణ ఉంటాయని తెలిపారు. 8 గంటలకు స్వామికి ఆకు పూజ, వడమాల అలంకరణ, హనుమత్ యాగం నిర్వహిస్తామని తెలిపారు.

వ్యాధుల సర్వే పూర్తి చేయాలి

జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావు



గంభీరంలో ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని పర్యవేక్షిస్తున్న జిల్లా వైద్యాధికారి జగదీశ్వరరావు

తగరపువలస: ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రం పరిధిలోని గంభీరం గ్రామంలో శుక్రవారం నిర్వహించిన ఫ్యామిలీ డాక్టర్ శిబిరాన్ని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జగదీశ్వరరావు సందర్శించారు. ఈ సందర్భంగా వైద్య సిబ్బందితో మాట్లాడుతూ వ్యాధుల సర్వేను నూరు శాతం పూర్తి చేయాలని ఆదేశించారు. మధుమేహం, రక్తపోటు వంటి పరీక్షలు చేసి వ్యాధిగ్రస్తులను గుర్తించాలన్నారు. ఫీవర్ సర్వే ద్వారా జ్వరం కేసులను నమోదు చేయాలన్నారు. ఆరోగ్యశ్రీ ద్వారా శస్త్ర చికిత్సలు చేయించుకుని డిశ్చార్జ్ అయిన కేసులను తప్పకుండా ఫాలోఅప్ చేయాలన్నారు. గర్భిణులకు 12 వారాల్లోపు రిజిస్ట్రేషన్లు చేయించి రక్తపరీక్షల ద్వారా రక్తహీనత, ఇతర హైరిస్క్‌లను గుర్తించాలన్నారు. మాతా, శిశు మరణాల రేటు తగ్గించాలన్నారు. ఈ సందర్భంగా గ్రామంలో డ్రై డే, ఫ్రై డే కార్యక్రమంలో భాగంగా లార్వా పెరగకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. డెంగ్యూ, మలేరియా ప్రబలకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలు వివరించారు. కార్యక్రమంలో డీపీఎం రామిరెడ్డి, శశిభూషణ్, హెల్త్ సూపర్‌వైజర్ ఇట్లా గోవిందరావు, సీహెచ్‌వో గౌతమి, ఏఎన్‌ఎం గంగాభవాని, మోహన్ తదితరులు పాల్గొన్నారు.

ముత్తంశెట్టి స్థానికుడు కాదనడానికి నీకున్న అర్హతేమిటి..?

మాజీ ఎంపీపీని ప్రశ్నించిన వైఎస్సార్ సీపీ నాయకులు



మాట్లాడుతున్న కోరాడ లక్ష్మణరావు

పద్మనాభం: భీమునిపట్నం ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్థానికుడు కాదని చెప్పడానికి మాజీ ఎంపీపీ డి.గోపాల కృష్ణమూర్తి రాజుకు ఉన్న అర్హతేమిటని వైఎస్సార్ సీపీ పద్మనాభం మండల శాఖ అధ్యక్షుడు కోరాడ లక్ష్మణరావు ప్రశ్నించారు. పద్మనాభం జంక్షన్‌లోని వైఎస్సార్ సీపీ కార్యాలయంలో శుక్రవారం రాత్రి నిర్వహించిన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడారు. ముత్తంశెట్టి శ్రీనివాసరావుకు నియోజకవర్గంలో కళాశాలలు, ఆస్తులు ఉన్నాయన్నారు. ముత్తంశెట్టి స్థానికుడా..? కాదా..? అనేది పార్టీ అధిష్టానం నిర్ణయిస్తుందన్నారు. నాలుగేళ్ల నుంచి పార్టీ కార్యకలాపాల్లో పాల్గొనని గోపాల కృష్ణమూర్తి రాజు వైఎస్సార్ సీపీలో అలజడి సృష్టించడానికే లేనిపోని ఆరోపణలు చేస్తున్నారన్నారు. గోపాలకృష్ణమూర్తి రాజు వ్యవహారాన్ని వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వై.వి.సుబ్బారెడ్డి దృష్టికి తీసుకెళ్లామన్నారు. సమావేశంలో ఎంపీపీ కంటుబోతు రాంబాబు, జెడ్పీటీసీ సభ్యుడు సుంకర గిరిబాబు, వైఎస్సార్ సీపీ నాయకులు బోని సన్యాసినాయుడు, గొర్రిపాటి పెద ఎర్రినాయుడు, అముజూరి అప్పారావు, తాలాడ పద్మనాభం, అవనాపు బంగారునాయుడు, సీర సూరప్పడు, తోనంగి అప్పలనాయుడు పాల్గొన్నారు.

అన్ని వర్గాలకూ సంక్షేమ పథకాలు



మహిళకు సంక్షేమ పథకాల కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

- జగనన్నతోనే అభివృద్ధి సాధ్యం
- ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

మధురవాడ: జగనన్న ప్రభుత్వంలోనే అన్ని వర్గాల ప్రజలకు సంక్షేమ పథకాలు అందుతున్నాయని, అభివృద్ధి జరుగుతోందని ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు అన్నారు. శుక్రవారం సాయంత్రం జీవీఎంసీ 5వ వార్డు పరదేశిపాలెం జేఎన్ఎన్‌యూఆర్‌ఎమ్ – 1 కాలనీ 79వ నంబరు సచివాలయం పరిధిలో గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉత్సాహంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన కాలనీలో తిరిగి ప్రజల సమస్యలు తెలుసుకుని వాటి పరిష్కారం కోసం హామీలు, భరోసా ఇచ్చారు.

కాలనీలో అంగన్‌వాడీ కేంద్రం ఏర్పాటు, పార్కు అభివృద్ధి చేసి పిల్లలు, వృద్ధులు, వాకర్స్‌కి సౌకర్యవంతంగా చేయాలని, కమ్యూనిటీ హాలు నిర్మించాలని ఎమ్మెల్యేను స్థానికులు కోరారు. వర్షాకాలంలో పక్కనే ఉన్న చెరువు నిండిపోవడంతో నీరు వెలుపలకు వెళ్లక ఇబ్బందులు పడుతున్నామని, కాలనీలోని 29 బ్లాకులకు 7 బ్లాకుల్లో మాత్రమే వాటర్స్ ట్యాంక్స్ కనెక్షన్లు ఉన్నాయని, హైవే నుంచి కాలనీ రోడ్డుకు లైటింగ్ లేక ఇబ్బందులు పడుతున్నామని... ఈ సమస్యలన్నీ పరిష్కరించాలని కోరారు. వీటిపై ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు స్పందిస్తూ పార్కు అభివృద్ధికి రూ.22.85 లక్షల నిధులు మంజూరయ్యాయన్నారు. కాలనీలో హౌస్ ట్యాక్స్ విధించేందుకు ప్రత్యేక డ్రైవ్ చేపట్టాలని జెడ్సీని ఆదేశించారు. సీఎం జగన్‌ను మరోసారి ముఖ్యమంత్రిని చేస్తేనే సంక్షేమ పథకాలు కొనసాగుతాయన్నారు. కార్యక్రమంలో జీవీఎంసీ 5వ వార్డు ఇన్‌చార్జి పోతిన సురేష్ కుమార్, వివిధ విభాగాల నాయకులు ముచ్చు రామారావు, లోహిత్, అప్పలరెడ్డి, వంకర అప్పారావు, ఎన్.బాబ్జి, భాగం స్వాతి సుధాకర్, జెడ్సీ కనక మహాలక్ష్మి, డీఈ శ్రీహరి, ఆర్ఐ మల్లేశ్వరరావు, ఏఈ వెంకటరావు, ఎస్ఐ కాకర శ్రీను తదితరులు పాల్గొన్నారు.



దివ్యాంగునికి కరపత్రం అందిస్తున్న ఎమ్మెల్యే ముత్తంశెట్టి శ్రీనివాసరావు

15 రోజులకోసారి మండల స్థాయిలో స్పందన

- రెవెన్యూ సమస్యలు పరిష్కరించడమే లక్ష్యం
- ఆర్డీవో హుస్సేన్ సాహెబ్




అర్జీలు స్వీకరిస్తున్న ఆర్డీవో హుస్సేన్ సాహెబ్

సింహాచలం: మండల స్థాయిలో రెవెన్యూ సమస్యలు పరిష్కరించడానికి స్పందన కార్యక్రమం ఎంతగానో దోహదపడుతుందని విశాఖ ఆర్డీవో హుస్సేన్ సాహెబ్ తెలిపారు. పెందుర్తి మండలంలో నెలలో రెండు శుక్రవారం రోజుల్లో స్పందన నిర్వహిస్తామని చెప్పారు. పెందుర్తి తహసీల్దార్ కార్యాలయంలో శుక్రవారం స్పందన కార్యక్రమాన్ని ఆర్డీవో ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్, సంయుక్త కలెక్టర్ ఆదేశాల మేరకు నెలలో రెండుసార్లు పదిహేను రోజులకోసారి విశాఖలోని ఆరు మండలాల్లో స్పందన నిర్వహించడం జరుగుతుందన్నారు. మండలస్థాయిలో అధికారులు తీసుకున్న నిర్ణయాలకు అర్జీదారులు తృప్తి చెందకపోతే పై అధికారుల దృష్టికి తీసుకెళ్లేందుకు ఈ కార్యక్రమం ఉపయోగపడుతుందన్నారు. మండలస్థాయిలో స్పందన పెట్టడం ద్వారా క్లిష్టమైన సమస్యలు ఉన్నవాళ్లు, జిల్లా కలెక్టర్ కార్యాలయానికి రాలేనివాళ్లు, వృద్ధాప్యంలో ఉన్నవాళ్లకు ఎంతో మేలు జరుగుతుందన్నారు. తహసీల్దార్ కార్యాలయాల్లో స్పందన నిర్వహించడం వల్ల అధికారులు, వీఆర్‌వోలు సిబ్బంది అందుబాటులో ఉండి అప్పటికప్పుడు సమస్య పరిష్కరించే అవకాశం ఉంటుందన్నారు.24 గంటల్లో సమస్య పరిష్కారం అవ్వాలనే లక్ష్యంతో ముందుకు వెళ్తున్నామన్నారు. క్లిష్టమైన సమస్యలు సమయానుకూలంగా పరిష్కారం చేయడం జరుగుతుందన్నారు. ప్రజలంతా స్పందన కార్యక్రమాన్ని వినియోగించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమం నిర్వహణ ద్వారా తప్పుడు నిర్ణయాలు తీసుకునే అవకాశం ఉండదన్నారు. పారదర్శకంగా అర్జీదారుడు సంతృప్తి పొందేలా సమస్య పరిష్కరించవచ్చని తెలిపారు. ఈ సందర్భంగా పలువురు నుంచి అర్జీలు స్వీకరించారు. కార్యక్రమంలో పెందుర్తి తహసీల్దారు ఆనంద్ కుమార్, ఎంపీడీవో వెంకటరావు పాల్గొన్నారు.

స్పందించిన హృదయాలకు ధన్యవాదాలు

ఆరిలోవ: తక్షణ సాయంగా రూ.లక్షతో పూర్తి స్థాయి వైద్యం అందిస్తామని భరోసా ఇచ్చిన సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి కృతజ్ఞతలు తెలుపుతూ హృద్రోగ బాధిత కుమారుడితో కుటుంబ సభ్యులు శుక్రవారం మేయర్ గొలగాని హరివెంకటకుమారిని కలిశారు. తమ ఆవేదనను ముఖ్యమంత్రికి వివరించేందుకు సహకరించిన మేయర్‌తో పాటు వైఎస్సార్ సీపీ నాయకుడు గొలగాని శ్రీనివాస్‌కు ధన్యవాదాలు తెలిపారు. గురువారం అపోలో ఆస్పత్రిలో కార్యక్రమం ముగిసిన అనంతరం కాన్వాయ్ తిరిగి వెళ్తుండగా హృద్రోగ బాధిత బాలుడు వానపల్లి చరణ్‌సాయి మణికంఠను తీసుకొని తల్లి పార్వతి ముఖ్యమంత్రిని కలిసిన విషయం తెలిసిందే. బాలుడి పరిస్థితిని తెలుసుకున్న ముఖ్యమంత్రి ఆమెకు వెంటనే తక్షణ సహాయం అందించాలని కలెక్టర్ మల్లికార్జునను ఆదేశించారు.

ఈ మేరకు జేసీ విశ్వనాథన్ రూరల్ తహసీల్దారు రమణయ్యతో కలసి అదేరోజు సాయంత్రం ఆరిలోవ ప్రాంతం శ్రీకాంత్‌నగర్‌లో ఉన్న పార్వతి ఇంటికి వెళ్లి తక్షణ సహాయం కింద రూ.లక్ష చెక్కు అందజేశారు. భవిష్యత్తులో పూర్తి స్థాయి వైద్యం అందిస్తామని భరోసా ఇచ్చారు. ఈ నేపథ్యంలో తన కుమారుడి పరిస్థితి ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లడానికి సహకరించిన మేయర్‌ను శుక్రవారం పెదగదిలిలో క్యాంప్ కార్యాలయంలో బాధిత కుటుంబ సభ్యులు కృతజ్ఞతలు తెలియజేశారు. ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌కు జీవితాంతం రుణపడి ఉంటామన్నారు.



వైఎస్సార్ సీపీ రీజినల్ కో ఆర్డినేటర్ వైవీ సుబ్బారెడ్డిని పార్టీ జోనల్ సాంస్కృతిక విభాగం ఇన్‌చార్జి వంకాయల మారుతీ ప్రసాద్ శుక్రవారం నగరంలో మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు.